మహానగర పాలికెలలో అర్ధరాత్రి దాకా వ్యాపారాలు

బెంగళూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక వృద్ధిని పెంపొందించుకునేందుకు నిబంధనలను సడలించారు. బెంగళూరుతోపాటు పలు మహానగర పాలికెలలో అర్ధరాత్రి 1 గంట వరకు వ్యాపార వ్యవహారాలను కొనసాగించుకునేందుకు వెసులుబాటు కల్పించారు. ప్రస్తుతం రాత్రి 11 గంటల వరకు మాత్రమే మహానగరాలలో వ్యాపారాలకు అవకాశం ఉంది. కొత్త నిబంధనలతో మరో రెండు గంటలు పెంచారు. బెంగళూరు, మైసూరు, హుబ్బళ్లి-ధారవాడ, బెళగావి, కలబురగి, తుమకూరు, దావణగెరె, శివమొగ్గ, బళ్లారి, మంగళూరు, విజయపుర జిల్లాలో ఇకపై రాత్రి 1 గంట వరకు వ్యాపారాలకు అవకాశం కల్పించారు.

అప్పులే ఆధారం

- రూ.3,71,383 కోట్లతో సిద్దూ బడ్జెట్
- గత ఏడాది కంటే రూ.43,636 కోట్లు అదనం
- లక్ష కోట్ల అప్పు కోసం ప్రతిపాదనలు
- ఐదు గ్యారెంటీలకు రూ.52వేల కోట్లు



లెదర్ బ్యాగులో బడ్జెట్ పుస్తకంతో శాసనసభకు సీఎం

బెంగళూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఐదు గ్యారెంటీ పథకాలతో పాటు అభివృద్ధి కోసం అప్పులు తప్ప మరో మార్గమే లేదనేలా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తయారయింది. ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆర్థికమంత్రి హోదాలో శుక్రవారం 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.3,71,383 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. గత ఏడాది బడ్జెట్ గాత్రంతో పోల్చితే రూ.43,636 కోట్ల దాకా పెరిగింది. ఆదాయం కొరతతో ప్రవేశపెట్టిన బడ్జెట్ ద్వారా రూ.1,05,246 కోట్ల అప్పులు తీసుకునేందుకు నిర్ణయించారు. గత ఏడాది సీఎం సిద్దరామయ్య ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సుమారు రూ. 85,818 కోట్లు రుణం తీసుకునేలా పొందుపరిచారు. ప్రస్తుతం పన్నులతో పాటు ఇతరత్రా ఆదాయం, కేంద్రం నుంచి గ్రాంట్లు ఆశాజనకంగా లేక పోవడంతో ఏకంగా రూ.1,05,246 కోట్ల మేర రుణం చేసేలా నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.6,855 కోట్లు, బహిరంగ మార్కెట్ ద్వారా రూ.96,840 కోట్లు రుణం తీసుకోనున్నట్లు ప్రకటించారు. ఆర్థిక సంవత్సరంలో ఎక్కువ ఆదాయం సాధించుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. బడ్జెట్‌లో రెవెన్యూ ఏకంగా రూ.2,63,177 కోట్లుగా నిర్ణయించారు. గత ఏడాది బడ్జెట్‌లో వాణిజ్య పన్నుల శాఖ ద్వారా రూ.98,650 కోట్లు లక్ష్యంగా పెట్టుకోగా ప్రస్తుతం రూ.1,10,000 కోట్లుగా నిర్ణయించారు. గత ఏడాది బడ్జెట్‌లో అబ్కారీ ద్వారా రూ.36,000 కోట్లు లక్ష్యంగా పెట్టుకోగా జనవరి నాటికి రూ.28,181 కోట్లకు సాధించారు.



బడ్జెట్ ప్రసంగం తర్వాత సీఎంను అభినందిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

ప్రస్తుతం రూ.38,525 కోట్లకు పెంచారు. బీర్ స్లాబ్‌లను పరిష్కరిస్తామని ప్రకటించారు. గత ఏడాది స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ద్వారా రూ. 25వేల కోట్లు లక్ష్యంగా పెట్టుకుని జనవరి నాటికి రూ.15,692 కోట్లు సాధ్యం చేశారు. ప్రస్తుత బడ్జెట్‌లో రూ.26వేల కోట్లకు పెంచారు. మోటారు వాహనాల చట్టం ద్వారా గత ఏడాది రూ.11,500 కోట్లు లక్ష్యం కాగా జనవరి నాటికి రూ.9,333 కోట్లు సాధ్యమైంది. ప్రస్తుత బడ్జెట్‌లో రూ.13,000 కోట్లకు పెంచారు. గనుల శాఖల ద్వారా రూ.9వేల కోట్లు రెవెన్యూ సంగ్రహించే లక్ష్యంగా ఉంది.

ఐదు గ్యారెంటీలకు రూ.52 వేల కోట్లు

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు ప్రధాన కారణమైన ఐదు గ్యారెంటీలకు బడ్జెట్‌లోను ప్రాధాన్యం ఇచ్చారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత గ్యారెంటీలు ఉండవనే ప్రచారం నేపథ్యంలో బడ్జెట్‌లోనే వాటిని పొందుపరచారు గృహలక్ష్మి ద్వారా ప్రతి కుటుంబ యజమాని మహిళకు నెలకు రూ. రెండువేలు, పేదవర్గాలకు ఉచిత విద్యుత్ అందించే గృహజ్యోతి, మహిళలు ఉచితంగా రాష్ట్రంలో ఆర్టీసీలో ప్రయాణించే శక్తి గ్యారెంటీతో పాటు అన్నభాగ్య ద్వారా ప్రతి బీపీఎల్ కార్డు లబ్ధిదారుడికి ఐదు కిలోలు ఇచ్చే పథకంతో పాటు యువనిధి గ్యారెంటీలకు బడ్జెట్‌లో రూ.52 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. గ్యారెంటీల ద్వారా ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ.50-55 వేల రూపాయల ఆర్థిక చేయూత కల్పిస్తున్నట్లు భరోసా ఇచ్చారు.

బడ్జెట్‌లో కీలక శాఖల కేటాయింపులు ఇలా..

శాఖ	రూ.కోట్లు	శాతం
విద్య	44,422	12
స్త్రీ, శిశు సంక్షేమం	34,406	9
విద్యుత్	23,159	6
పంచాయతీరాజ్	21,160	5
రవాణా, అంతర్గత వ్యవహారాలు	19,777	5
జల వనరులు	19,179	5
నగరాభివృద్ధి, వసతి	18,155	5
రెవెన్యూ	16,170	4
వైద్య, ఆరోగ్యం	15,145	4
సాంఘిక సంక్షేమం	13,334	3
ప్రజాపనుల విభాగం	10,424	3
పౌర, ఆహార సరఫరాలు	9963	3
వ్యవసాయం, ఉద్యానవనం	6688	2
పశుసంవర్ధక, మత్స్య	3307	1
ఇతర శాఖలు	1,24,593	33
పన్నుల రూపంలో అంచనా		
వాణిజ్య పన్నులు	1,10,000	58
మోటారు వాహనాలు	13,000	7
రిజిస్ట్రేషన్స్	26,000	14
అబ్కారీ	38,525	20
ఇతర పన్నులు	2368	1



శాసనసభలో బడ్జెట్ ప్రసంగం చేస్తున్న సీఎం సిద్దరామయ్య



బడ్జెట్ పుస్తకంలో రాజ్యాంగ పీఠిక

కేంద్రం తీరుపై సీఎం ఆగ్రహం

బెంగళూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్ ప్రవేశపెట్టే సందర్భంలోను బీజేపీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వ తీరుపై ముఖ్యమంత్రి సిద్దరామయ్య విరుచుకుపడ్డారు. ఆర్థికమంత్రి హోదాలో సీఎం సిద్దరామయ్య శుక్రవారం బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. దేశంలో గణతంత్ర దినోత్సవాలకు 75 ఏళ్లయిన సందర్భంగా ఏడాది పాటు రాజ్యాంగంపై అవగాహనా కార్యక్రమాలు జరుపుతున్న తీరులోనే బడ్జెట్ పుస్తకంపై రాజ్యాంగ పీఠికను ముద్రించడం ద్వారా కొత్త విధానానికి శ్రీకారం చుట్టారు. గడిచిన యూపీఏ, ప్రస్తుత ఎన్‌డీఏ ప్రభుత్వాల వ్యత్యాసాన్ని ప్రారంభంలోనే ఎండగట్టారు. యూపీఏ పాలనలో ఆరోగ్యం, ఆహారం, విద్య, ఉద్యోగాలు, శాశ్వత నివాసాలు వంటి ప్రజాకర్షక పథకాలతో పేదలకు న్యాయం చేసిందని తెలిపారు. పదేళ్ల ఎన్‌డీఏ పాలనలో ప్రజావ్యతిరేక విధానాలు పెరిగాయని, అసమానత పెరిగిందని, కేవలం కొందరి వద్దనే సంపదగా మారిందని మండిపడ్డారు. గ్యారెంటీలతో ఖజానా ఖాళీ అయ్యిందనే కేంద్ర ప్రముఖులు ప్రస్తావనను దృష్టిలో ఉంచుకుని తమ గ్యారెంటీలకు వస్తున్న ప్రజాదరణ జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇవే గ్యారెంటీలను కాపీలు చేసుకుంటున్నారని బీజేపీపై పరోక్షంగా విమర్శించారు. కేంద్రప్రభుత్వం 2023-24 బడ్జెట్‌లో ఎగువ భద్ర ప్రాజెక్టుకు రూ.5,300 కోట్లు కేటాయించిందని, ఏడాది వ్యవధిలో కనీసం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదనే విషయాన్ని బడ్జెట్‌లోను ప్రస్తావించారు.



రూపాయి రాక.... రూపాయి పోక ఇలా..

బెంగళూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక శాఖను నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య శుక్రవారం శాసనసభలో ప్రవేశపెట్టిన 2024-25 వార్షిక బడ్జెట్‌లో రూపాయి రాక, రూపాయి పోక ఇలా ఉంది.

రూపాయి రాక

రాష్ట్ర పన్నుల ఆదాయం	52 పైసలు
రాష్ట్ర పన్నుయేతర ఆదాయం	4 పైసలు
కేంద్ర ప్రభుత్వ గ్రాంట్లు	4 పైసలు
కేంద్ర పన్నుల్లో వాటా	12 పైసలు
రుణాల రూపంలో	28 పైసలు

రూపాయి పోక

అప్పులపై వడ్డీ చెల్లింపు	18 పైసలు
ఇతర సాధారణ సేవలకోసం	17 పైసలు
సాంఘిక సంక్షేమం	15 పైసలు
తాగునీటి సరఫరాకు	3 పైసలు
ఇతర సామజిక సేవలకు	3 పైసలు
ఆరోగ్య రంగం	4 పైసలు
విద్యా రంగం	11 పైసలు
వ్యవసాయం, నీటి పారుదల, గ్రామీణాభివృద్ధి కోసం	14 పైసలు
ఇతర ఆర్థిక సేవల కోసం	15 పైసలు



మీడియాతో మాట్లాడుతున్న సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్

అన్ని వర్గాలకు ఆర్థిక పరిపుష్టి : సీఎం

- అందర్నీ ఒప్పించే అద్భుత బడ్జెట్ : డీసీఎం

బెంగళూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): 2024-25 సంవత్సరానికి గాను తాను సమర్పించిన 15వ బడ్జెట్ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు ఆర్థికపుష్టినివ్వడం ఖాయమని, ఇందుకు అనుగుణంగానే పథకాల రూపకల్పన చేశామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య పేర్కొన్నారు. సచివాలయంలో శుక్రవారం సాయంత్రం ఆయన ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, పలువురు మంత్రులతో కలసి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని ఒక ముఖ్యమంత్రిగా ప్రజలముందు ఉంచాల్సిన బాధ్యత తనపై ఉందని, ఈ కర్తవ్యాన్ని తాను నెరవేర్చానని పేర్కొన్నారు. బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వాన్ని ఆడిపోసుకోలేదని, రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని నిలదీశామని తెలిపారు. గ్యారెంటీ పథకాలకు సముచిత ప్రాధాన్యత ఇస్తూనే రాష్ట్ర సమగ్ర వికాసానికి పలు కార్యక్రమాలు రూపొందించామన్నారు. కేంద్రం నుంచి న్యాయబద్ధమైన వాటా రాకున్నా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు ఆగదని స్పష్టం చేశారు. బీజేపీకి పార్లమెంటరీ, ప్రజాస్వామ్య, రాజ్యాంగ వ్యవస్థలపై నమ్మకం లేదని చురకలంటించారు. బడ్జెట్‌ను వాకౌట్ చేయడం ద్వారా బీజేపీ చౌకబారు రాజకీయ ఎత్తుగడలకు పాల్పడిందని, ఏడుకోట్లమంది ప్రజలను అవమానించిందని విమర్శించారు. జేడీఎస్ నేత హెచ్‌డీ కుమారస్వామి బీజేపీ అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రం ఆర్థికంగా బలిష్ఠంగా ఉందని ఆయన గణాంక వివరాలను మీడియా ముందుంచారు. ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సమగ్ర కర్ణాటక ప్రగతికి రాచబాటలు వేసే బడ్జెట్‌ను చూసి ప్రతిపక్షాలకు మతి తప్పిందన్నారు. ప్రజల జీవితాలలో వెలుగు నింపే బడ్జెట్‌ను అందించామని, ప్రతిపక్షాలు దీన్ని జీర్ణించుకోలేక సభనుంచి వాకౌట్ చేశాయన్నారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి భేషుగ్గా ఉందని కొనియాడుతూ కరువు విలయతాండవం చేస్తున్నా, కేంద్రం నుంచి సాయం అందకపోయినా, న్యాయసమ్మత వాటా రాకపోయినా ముఖ్యమంత్రి సిద్దరామయ్య చక్కటి కసరత్తు చేసి ఎవరినీ నొప్పించక అందరినీ ఒప్పించే అద్భుత బడ్జెట్‌ను రూపొందించారని ఆయన ప్రశంసలు గుప్పించారు.



3.15 గంటల సుదీర్ఘ బడ్జెట్ ప్రసంగం అనంతరం నీళ్లు తాగుతున్న సీఎం



విధానసౌధ ప్రాంగణంలో ప్లకార్డులతో బీజేపీ, జేడీఎస్ ఎమ్మెల్యేల నిరసన

సిద్దు బడ్జెట్‌పై ప్రతిపక్షాల నిరసన

- సభ నుంచి వాకౌట్
- విధానసౌధ ప్రాంగణంలో ధర్నా
- కేంద్రంతో కయ్యానికి కాలు దువ్వారని బీజేపీ ఆరోపణ
- ఇంత చెత్త బడ్జెట్ ఎన్నడూ చూడలేదు : యడియూరప్ప
- రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేశారు : బొమ్మై
- వినాశనానికి పునాదులు : కుమారస్వామి

బెంగళూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆర్థికమంత్రి హోదాలో శాసనసభలో శుక్రవారం ప్రవేశపెట్టిన 2024-25 వార్షిక బడ్జెట్‌పై ప్రతిపక్షాలైన బీజేపీ, జేడీఎస్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డాయి. ప్రత్యేకించి బడ్జెట్‌లో కేంద్రప్రభుత్వంపై నేరుగా ఆరోపణలు చేయడాన్ని బీజేపీ తప్పుబట్టింది. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు సిద్దరామయ్య కేంద్రంపై దాడికి దిగడం ద్వారా బడ్జెట్ పవిత్రను మంటగలిపారని మండిపడింది. కేంద్రంతో కయ్యానికి కాలుదువ్వారని విరుచుకుపడింది. సీఎం తన బడ్జెట్ ప్రసంగాన్ని చదువుతుండగానే ప్రతిపక్షాలు సభ నుంచి వాకౌట్ చేశాయి. రాష్ట్ర శాసనసభ బడ్జెట్ చరిత్రలో ప్రతిపక్షాలు ఇలా వాకౌట్ చేయడం ఇదే తొలిసారి. అనంతరం విధానసౌధ ప్రాంగణంలో బడ్జెట్ అభివృద్ధి విరోధిగా ఉందని ఆరోపిస్తూ ప్లకార్డులతో ధర్నా నిర్వహించాయి. ఈ ధర్నాకు బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు బీవై విజయేంద్ర సారథ్యం వహించారు. ధర్నాలో మాజీ ముఖ్యమంత్రులు బసవరాజ్ బొమ్మై, హెచ్‌డీ కుమారస్వామి, శాసనసభలో ప్రతిపక్ష నేత ఆర్.అశోక్ తదితరులు పాల్గొన్నారు. బడ్జెట్‌పై బీజేపీ, జేడీఎస్ నేతలు చేసిన వ్యాఖ్యలు ఇలా ఉన్నాయి.

ఇది చెత్త బడ్జెట్ : యడియూరప్ప

తన రాజకీయ జీవితంలోనే ఇంత చెత్త బడ్జెట్‌ను చూడలేదని బీజేపీ జాతీయ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు, మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్ప వ్యాఖ్యానించారు. కేంద్రంపై ఆరోపణలు గుప్పించేందుకు బడ్జెట్‌లో పేజీలు కేటాయించిన సిద్దరామయ్య రాష్ట్ర అభివృద్ధిలో తన పాత్ర ఏమిటన్నది ఎక్కడా స్పష్టం చేయలేదన్నారు. ఢిల్లీ జంతర్‌మంతర్ ధర్నా కొనసాగింపులో భాగంగానే బడ్జెట్ సిద్ధమైందని మండిపడ్డారు. బడ్జెట్‌లో అభివృద్ధి కార్యక్రమాలను నిర్లక్ష్యం చేసి ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. రాజధాని బెంగళూరుకు మొండిచేయి చూపారని, ప్రభుత్వ ఉద్యోగులకు ఏడో వేతన సంఘం సిఫారసులు, పాత పెన్షన్ విధానంపై స్పష్టత లేదన్నారు. 2023-24 బడ్జెట్‌లో రూ.12,525 కోట్లుగా ఉన్న కొరత 2024-25 నాటికి రూ.27,353 కోట్లకు పెరిగిందన్నారు. బడ్జెట్‌లో దూరదృష్టి ఏమాత్రం లేదన్నారు.

రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేశారు : బొమ్మై

ముఖ్యమంత్రి సిద్దరామయ్య రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేశారని, ఏడు కోట్ల మంది ప్రజలపై తలా రూ. 44వేలు అప్పు భారం మోపారని మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై పేర్కొన్నారు. బడ్జెట్‌పై ఆయన స్పందిస్తూ గత ఏడాది రూ.85,928 కోట్ల మేరకు అప్పులు చేయగా ప్రస్తుత ఏడాది చేయబోయే అప్పులు కలిపితే మొత్తం రూ.1,05,496 కోట్లకు చేరుకుంటుందన్నారు. గ్యారెంటీలతో ప్రభుత్వం ఆర్థికంగా దివాళా తీసిందనడానికి ఇంతకంటే సాక్ష్యం అవసరం లేదన్నారు. కేంద్రం పన్నుల తారతమ్యం చూపుతోందన్న సీఎం ఆరోపణలను ఖండించిన ఆయన జీఎస్టీ కౌన్సిల్ సమావేశానికి ఒక్కసారి కూడా హాజరు కాని సీఎం దీన్ని రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. గత ఏడాది కంటే రూ.25వేల కోట్లు అధికంగా అప్పులు చేసి అందులో కేవలం రూ.వెయ్యి కోట్లు మాత్రమే అభివృద్ధికి కేటాయించారన్నారు.

20 ఏళ్లు వెనక్కి నెట్టేయడం ఖాయం : విజయేంద్ర

ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్రాన్ని 20 ఏళ్లు వెనక్కి నెట్టేయడం ఖాయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర పేర్కొన్నారు. బెంగళూరులో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, రైతు ప్రయోజనాల దృష్టితో చూస్తే ఇది శూన్య ప్రగతి బడ్జెట్‌గా ఉందన్నారు. కేంద్రంతో ఘర్షణకు దిగడం ద్వారా బడ్జెట్ పవిత్రతను మంటగలిపారని ఆరోపించారు. ఉత్తర కర్ణాటక అభివృద్ధికి రూపాయి కూడా విదల్చలేదన్నారు. అన్ని వర్గాలకు మొండి చేయి చూపారన్నారు.

అందరికి పన్ను - అందరిపై అప్పు : అశోక్

సిద్దరామయ్య బడ్జెట్ అబద్ధాల పుట్టగా రాజకీయ ప్రసంగంలా ఉందని ప్రతిపక్షనేత ఆర్. అశోక్ పేర్కొన్నారు. బడ్జెట్‌పై ఆయన స్పందిస్తూ తనకు తాను ఆర్థిక నిపుణుడని చెప్పుకొనే సిద్దరామయ్య తన 15వ బడ్జెట్‌ను అడ్డగోలుగా సమర్పించారని, ఇందులో అర్థశాస్త్రంగానీ, అభివృద్ధిగానీ దూరదృష్టిగానీ మచ్చుకైనా లేవన్నారు. బడ్జెట్‌లో ఆదాయ వనరుల కోసం పన్నులపైనే ఆధారపడ్డారని రూ.1.75 లక్షల కోట్ల పన్నుల వసూళ్ల లక్ష్యం నెరవేరితే గానీ అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల దిక్కు ఉండదన్నారు. ఈ లెక్కన రానున్న రోజుల్లో అందరికీ పన్ను అందరిపై అప్పు తథ్యమని, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు బడ్జెట్‌లో అడుగడుగునా కనిపించాయన్నారు.

వినాశనానికి పునాదులేశారు : కుమారస్వామి

ముఖ్యమంత్రి సిద్దరామయ్య బడ్జెట్‌లో వినాశకాలానికి బలమైన పునాదులు వేశారని జేడీఎస్ నేత, మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి విరుచుకుపడ్డారు. సచివాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఏడు కోట్ల ప్రజల చెవుల్లో ఈ బడ్జెట్ ద్వారా సిద్దరామయ్య పువ్వులు పెట్టారన్నారు. ఇది అభివృద్ధి మాట ఎత్తితే 'రేపు రా...' అన్నట్టు ఉందని ఎద్దేవా చేశారు. ఒకవైపు కేంద్రంపై విరుచుకుపడుతూ మరోవైపు కేంద్రాన్ని అర్థిస్తున్నారన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి కేంద్రంపై మాత్రమే ఆక్రోశం ఉందని అనుకున్నానని, బడ్జెట్ కాపీ చూశాక ఆయన ఆగ్రహం రాష్ట్రంలోని ఏడు కోట్లమంది ప్రజలపైనా ఉందని తేలిందన్నారు. గ్యారెంటీల మోజులో పడి అభివృద్ధిని సర్వనాశనం చేస్తున్నారని ఆరోపించారు.


ప్రశాంతంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు

86.38 శాతం పోలింగ్

బెంగళూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు ఉపాధ్యాయ నియోజకవర్గానికి శుక్రవారం జరిగిన ఎన్నికల్లో 86.38 శాతం పోలింగ్ నమోదైంది. బెంగళూరు నగర, గ్రామీణ, రామనగర జిల్లాల పరిధిలో ఎన్నిక జరిగింది. కాంగ్రెస్ అభ్యర్థిగా పుట్టణ్ణ, బీజేపీ-జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థిగా ఏపీ రంగనాథ్ పోటీలో నిలిచారు. 19,152 మంది ఓటర్లు కాగా వీరిలో 7,128 మంది పురుషులు, 12,024 మహిళలు ఉన్నారు. పోలింగ్‌లో 6,504 మంది పురుషులు, 10,040 మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. కౌంటింగ్ ఈనెల 20న జరగనుంది.

27న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల మహాసమ్మేళనం

బెంగళూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల మహాసమ్మేళనం ఈ నెల 27న ప్యాలెస్ మైదానంలో జరగనుంది. ఈ సమ్మేళనానికి రాష్ట్ర వ్యాప్తంగా మూడు లక్షల మంది ఉద్యోగులు హాజరుకావచ్చునని అంచనా వేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సిఎస్ షడాక్షరి శుక్రవారం నగరంలో మీడియాతో మాట్లాడుతూ ఏడేళ్ల విరామం తర్వాత జరిగే ఈ సమ్మేళనాన్ని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రారంభిస్తారని, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో పాటు పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొంటారన్నారు. ప్రముఖ హృద్రోగ నిపుణుడు డాక్టర్ సీఎన్ మంజునాథ్ ఈ సమ్మేళనంలో ప్రత్యేక ప్రసంగం చేస్తారన్నారు. ఏడో వేతన సంఘం సిఫార్సులను సాధ్యమైనంత త్వరగా అమలు, పాత పెన్షన్ విధానం తదితర అంశాలపై సదస్సులో తీర్మానాలను ఆమోదించి ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాల కోసం నగదు రహిత కర్ణాటక ఆరోగ్య సంజీవిని పథకాలను అమలు చేయాలన్న డిమాండ్‌ను ప్రభుత్వం ముందు ఉంచుతామన్నారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సదస్సు మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగుతుందన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1587.86	1,610.85
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	142	8,252
సామర్థ్యం (టీఎంసీలు)	9.33	39.27

నేడు జగజ్యోతి బసవన్న విగ్రహావిష్కరణ



మాట్లాడుతున్న తాలుకా పంచాయతీ ఈవో పవన్‌కుమార్ దండప్ప

సిరుగుప్ప, ఫిబ్రవరి 16 : జగజ్యోతి బసవన్న విగ్రహావిష్కరణను శనివారం చారిత్రాత్మకంగా జరుపుకోవాలని తాలుకా పంచాయతీ ఈవో పవన్ కుమార్ దండప్ప సూచించారు. సిరుగుప్ప తాలుకా పంచాయతీ భవనంలో 12వ శతాబ్దం క్రాంతికారి జగజ్యోతి బసవన్న భావచిత్ర పటం ఆవిష్కరణ ఉదయం 10 గంటలకు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు హాజరుకావాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా వీర శైవ సమాజం అధ్యక్షులు శివకుమార్, బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ గాదెలింగ, అబ్దుల్ నబీ తదితరులు పాల్గొన్నారు.

పీడీ హళ్లి ఎస్ఐగా నాగభూషణ



బళ్లారిరూరల్, ఫిబ్రవరి 16 : తాలుకాలోని పీడీ హళ్లి ఎస్ఐగా నాగభూషణ గురువారం సాయంత్రం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ శశిధర్‌ను కొప్పాళ్ జిల్లా ట్రాఫిక్ ఎస్ఐగా ఉన్నతాధికారులు బదిలీ చేసిన విషయం విదితమే. గతంలో నాగభూషణ బళ్లారి ట్రాఫిక్ ఎస్ఐగా విధులు నిర్వహించేవారు. గురువారం పీడీ హళ్లి ఎస్ఐగా బాధ్యతలు తీసుకున్నారు.

ఎస్సీ రిజర్వేషన్ కల్పించండి

కంప్లి, ఫిబ్రవరి 16 : సవితా సమాజాన్ని ఎస్సీ రిజర్వేషన్లో చేర్చాలంటూ సవిత సమాజం అధ్యక్షులు జే హనుమంతప్ప కోరారు. శుక్రవారం సవిత మహర్షి జయంతి సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, సమాజం పదాధికారులు జయంతిని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ సదుపాయాలు, ఇళ్ల స్థలాలు, కల్పించాలన్నారు. అలాగే సమాజంలో ఐక్యతగా ముందడుగు వేయాలని, అన్ని రంగాలలో ముందుకు రావాలని సూచించారు. వారితో పాటు తహసీల్దార్ శివరాజ్, డీటీ రవీంద్ర కుమార్, పాండురంగ, అంజనేయశ్రీనివాస్, ఆనంద్, రాజు, శీను, కాశీ, గాదలింగ, బుజ్జ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధార్మిక కార్యక్రమాలతోనే గ్రామాలు ప్రశాంతం



నూతన జంటలను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే

కంప్లి, ఫిబ్రవరి 16 : గ్రామాలలో ధార్మిక కార్యక్రమాలతోనే ప్రశాంతత నెలకొంటుందని ఎమ్మెల్యే జేఎన్ గణేష్ తెలిపారు. సన్నాపురం గ్రామంలో శుక్రవారం చిక్కినకొప్ప శరణు స్వాముల 29వ పుణ్యతిథి సందర్భంగా ఐదు జంటలకు సామూహిక వివాహాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్వాములు మాట్లాడుతూ ఈ సామూహిక వివాహాలు పేద కుటుంబాలకు ఎంతో అనుకూలంగా వుంటాయన్నారు. బైలూరు మల్లప్ప తాత, ఎమ్మిగనూరు జడే సిద్దేశ్వర, దమ్మూరు వెంకోబ దూత మాదిరిగానే చిక్కినకొప్ప స్వాములు కూడా దైవదూతలని తెలిపారు. దంపతులు అన్యోన్యంగా జీవనం గడుపుతూ కష్టాలను ఎదుర్కొని సుఖ జీవనం సాగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెబ్బాళ మఠ నాగభూషణ శివాచార్యులు, ముష్టూరు ఈశ్వరయ్య, మూకయ్య స్వామి, జెడ్పీ శ్రీనివాసరావు, సుధీర్, కరిబసవన గౌడ, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విఫలమైన కేంద్ర ప్రభుత్వం

కంప్లి, ఫిబ్రవరి 16 : న్యాయం కోసం ఢిల్లీకి వెళుతున్న రైతులపై బాష్పవాయువుతో అడ్డుకోవడం సరి కాదని సంఘం సంస్థ నేతలు తెలిపారు. శుక్రవారం అఖిలభారత రైతు సంఘం, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం ఏజెన్సీల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగప్ప, మెహబూబ్, పంపాపతి పాల్గొన్నారు.



తం సూర్యం ప్రణమామ్యహమ్!

రథసప్తమి సందర్భంగా 108 నమస్కారాలతో సూర్యుడికి ప్రణతులు

మిత్రరవి సూర్యభాను ఖగ పూష్ణ హిరణ్యగర్భ
మరీచాదిత్య సవిత్రర్క భాస్కరే భ్యాం నమః

అంటూ రథసప్తమి సందర్భంగా భక్తితో సూర్య నమస్కారాలు చేశారు బళ్లారి వాసులు.

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 16: రథసప్తమి సందర్భంగా శుక్రవారం ఉదయం హొసపేట ఫ్రీడం పార్కులో పతంజలి కమిటీ ఆధ్వర్యంలో ప్రజలు 108 సూర్య నమస్కారాలు చేశారు. యువ భారత్ రాష్ట్ర ఇన్‌చార్జి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో 130మందికి పైగా యోగా ప్రియులు సూర్యనమస్కార కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరిలో 36మంది 108 సార్లు సూర్య నమస్కారాలను పూర్తిచేశారు. ఈసందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి రోజూ సూర్యనమస్కారాలు చేయడం వల్ల శరీరం, మనస్సు, ఉల్లాసంగా ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరూ ఇంట్లో కనీసం 12సార్లు ఇలా చేయడం అలవాటు చేసుకోవాలని ఆయన సూచించారు. హంపి కన్నడ విశ్వవిద్యాలయ ఆచార్యులు, విజయనగరం జిల్లా ఇన్‌ఛార్జి సీనియర్ యోగా అభ్యాసకులు ప్రొఫెసర్ హల్లికేరి యోగా సాధకులను అభినందించి సూర్య నమస్కార ప్రాముఖ్యతను వివరించారు. సీనియర్ యోగా గురువులు అశోక్ చిత్ర శ్రీధర్, శివమూర్తి, మల్లికార్జున, శ్రీనివాస మంచికట్టి, వగీష్, కలకప్ప, అనంతజోషి, బాలకృష్ణ, చంద్రకళా, నూర్జాన్ రాజాభక్షి తదితరులు పాల్గొన్నారు. హొసపేటలోని దాదాపు 28చోట్ల పతంజలి యోగా కమిటీ ఆధ్వర్యంలో ఉచిత యోగా శిబిరాలను నిర్వహించారు. అక్కడి యోగా అభ్యాసకులు కూడా చివరకు ఫ్రీడమ్ గార్డెన్‌కు చేరుకుని సామూహిక సూర్య సమస్కారంలో పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభం నుంచి చివరి వరకు వృక్షశాస్త్రజ్ఞుడు మారుతీ పూజారి అగ్నిహోత్రాన్ని నిర్వహించారు.



సూర్యనమస్కారాల్లో పాల్గొన్న ఔత్సాహికులు

బడ్జెట్‌లో బళ్లారిపై సీఎం సిద్దూ వరాల జల్లు

- ఏపీఎంసీ మార్కెట్‌లో కోల్డ్ స్టోరేజీల నిర్మాణం
- బయో సీఎన్‌జీ సెంటర్ ఏర్పాటు
- సందూరులో స్కిల్ అకాడమీ
- జీన్స్ అపెరల్ పార్కు ఏర్పాటుకు చర్యలు



అసెంబ్లీలో మాట్లాడుతున్న సీఎం సిద్దూ

బళ్లారి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్ సమావేశంలో సీఎం సిద్దరామయ్య బళ్లారి జిల్లాపై వరాల జల్లు కురిపించారు. 2024-25 ప్రకటించిన బడ్జెట్‌లో బళ్లారి ఏపీఎంసీ మార్కెట్‌లో రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు కొత్తగా కోల్డ్ స్టోరేజీ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యంతో బయో సిఎన్‌జి సెంటర్‌ను ఏర్పాటుచేసి కూరగాయలు ఏమాత్రం వృథా కాకుండా ఉండేందుకు నిధులను మంజూరు చేశారు. జిల్లాలో తల్లిపాల బ్యాంకు కోసం ప్రత్యేక డెయిరీ ఏర్పాటు, పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న రంగాలలో నైపుణ్యం కలిగిన శ్రామికశక్తి అవసరాలను గుర్తించడానికి బళ్లారి జిల్లా సండూరులో స్కిల్ అకాడమీని ఏర్పాటు చేయడం, నాబార్డు సహాయంతో జిల్లా మినరల్ ఫండ్ ద్వారా బళ్లారిలోని కొత్తప్రభుత్వ సాధనాల దుకాణం ఏర్పాటు చేయడం ముఖ్యమైనవి. బళ్లారి నగరం సమీపంలో ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ అభివృద్ధి, బళ్లారిలో సంఘటిత జీన్స్ పరిశ్రమలను నిర్వహించడానికి, వాటిని ప్రపంచ స్థాయికి అప్‌గ్రేడ్ చేయడానికి జీన్స్ అపెరల్ పార్కు కామన్ ఫెసిలిటీ సెంటర్ అభివృద్ధి, స్పోర్ట్స్ హాస్టల్ అప్‌గ్రేడేషన్, స్పోర్ట్స్ సౌకర్యాల అభివృద్ధికి జిల్లా మినరల్ ఫౌండేషన్ నుండి రూ. 10 కోట్లు అందిస్తామని ప్రకటించారు. అలాగే బళ్లారి జిల్లాలో పాటు విజయనగర జిల్లాలో కూడా అనేక అభివృద్ధి పనులకు బడ్జెట్‌లో సీఎం సిద్దరామయ్య నిధులను ప్రకటించారు. మొత్తం మీద బళ్లారి, విజయనగర జిల్లాలకు బడ్జెట్‌లో సీఎం సిద్దరామయ్య నిధులు ఇచ్చారని అధికార పార్టీ నాయకులు సంతోషం వ్యక్తం చేస్తుంటే ప్రతిపక్ష నాయకులు మాత్రం సిద్దరామయ్య బడ్జెట్ అంతా బూటకం అని, కేవలం లెక్కల గారడీ అని అందులో వాస్తవం లేదని మండిపడుతున్నారు.

ఘనంగా సవితా మహర్షి జయంతి

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 16: సవితా మహర్షి జయంతిని శుక్రవారం నగరంలోని బీడీఏఏ మైదాన హాల్లో ఘనంగా నిర్వహించారు. జిల్లా యంత్రాంగం, జిల్లాపంచాయితీ, కన్నడ సాంస్కృతిక శాఖ, మహానగర పాలిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని నగర మేయర్ శ్వేత ప్రారంభించి మాట్లాడారు.

సవితా మహర్షి సామాజిక వేత్తగా ఎదిగి ఓ వెలుగు వెలిగారని, సవితా సమాజం అన్ని తరగతుల ప్రజలకు వివక్ష లేకుండా సేవలందిస్తోందన్నారు. ఈసంఘం సామాజికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా బలోపేతం కావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తక్కువ జనాభా ఉన్న సవితా సమాజం సంఘటితమైతేనే ప్రధాన స్రవంతి అవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ వృత్తిపట్ల గౌరవం, విధేయత కలిగి ఉన్నప్పుడే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవడం సాధ్యమవుతుందని,సవితా మహర్షి మార్గాన్ని అనుసరించి మన ఆచార వ్యవహారాలు, ఆలోచనలను వారి ఆశయాలను మేళవించుకుంటే సమాజంలో మంచి పౌరులుగా ఎదుగుతారని అన్నారు. మహర్షి ఆశయాలను సంఘ సభ్యులు తమ జీవితంలో అలవర్చుకొని ముందుకు సాగాలన్నారు. శరణ సాహిత్య పరిషత్ జిల్లాధ్యక్షులు సిద్దలింగప్ప మాట్లాడుతూ సవితామహర్షి మాఘ మాస శుక్లపక్షంలో రథసప్తమి రోజున జన్మించారన్నారు. మహర్షి శివుని కుడి కన్ను నుండి జన్మించారని నమ్ముతారు.



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మేయర్ శ్వేత



సిరుగుప్ప తహసీల్దార్ కార్యాలయంలో ...

అలరించిన శోభయాత్ర

మహానగర పాలిక మేయర్ బి.శ్వేతా సవితామహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి శోభయాత్రను ప్రారంభించారు. శోభయాత్ర కొత్త జిల్లా పాలనా భవనం నుంచి ప్రారంభమై ఇందిరా సర్కిల్, కేసీరోడు, మీనాక్షి సర్కిల్, గడిగి చెన్నప్ప సర్కిల్ మీదుగా సాగి బీడీఏఏ ఫుట్‌బాల్ గ్రౌండు పోడియంహాల్ వద్ద ముగిసింది. శోభయాత్రలో వివిధ సాంస్కృతిక బృందాలు పాల్గొని అలరించాయి. ఈసందర్భంగా మహానగరపాలిక డిప్యూటీ మేయర్ బి.జానకి, మాజీ మేయర్ ఎం.రాజేశ్వరీ, సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకులు బినాగరాజ్, సవితా సంఘం అధ్యక్షుడు సన్నగౌండ్ల రాకేశ్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సిరుగుప్పలో ...

సిరుగుప్ప, ఫిబ్రవరి 16 : పట్టణంలో ఘనంగా సవితామహర్షి జయంతి వేడుకలు జరిగాయి. తహసీల్దార్ షంషాలం ఆదేశాల మేరకు సవితా మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలను జరుపుకున్నారు. సవితా మహర్షి చరిత్రను జడ్పీ తహసీల్దార్ సిద్దార్థ్ వివరించారు. ఈ సందర్భంగా విరుపాక్షి, రవీంద్ర కుమార్, మాంతేష, గంగాధర, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలను తగ్గించాలి

కలెక్టరేట్ ఆవరణలో నిరసన చేపట్టిన రైతు కూలీలు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 16: నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని కోరుతూ శుక్రవారం నగరంలోని గాంధీభవన్ నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు రైతు కూలీల నిరసన ప్రదర్శన జరిగింది. నిత్యావసర వస్తువులు, పెట్రోలియం ఉత్పత్తులు, మందులు ధరలు తగ్గించాలని కోరుతూ జిల్లా యంత్రాంగం ద్వారా రాష్ట్రపతికి వినతి పత్రం సమర్పించారు. రైతు కార్మిక ప్రముఖులు దేవదాసు, డాక్టర్ ప్రమోద్ , సత్యబాబు మాట్లాడుతూ రైల్వే, మిలటరీ, విద్యుత్, బొగ్గు, చమురు, ఉక్కు, రవాణా, బ్యాంకు, బీమా తదితర ప్రభుత్వ రంగాల ప్రవేటీకరణ కాంట్రాక్టులను నిలిపివేయాలని, కార్మిక వ్యతిరేక విధానాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీలను భర్తీ చేయాలని, ఉపాధి కల్పనకు చర్యలు తీసుకోవాలని, తాజా రిక్రూట్‌మెంట్‌పై నిషేధాన్ని ఉపసంహరించుకోవాలని, ఉపాధి హక్కును ప్రాథమిక హక్కుగా నిర్ధారించాలని కోరారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, పేర్కొన్నారు. సంఘటిత, అసంఘటిత, సామాజిక కార్మికులందరికి కనీస పించన్ రూ. 12వేలు ఇవ్వాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈసందర్భంగా తాయప్ప, ఆదిమూర్తి, డాక్టర్ ప్రమోదు, ఎ.శాంత, శివశంకర్, గురల్లి రాజా, సంగనకల్లు కృష్ణప్ప, లేపాక్షి తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కలెక్టరేట్ ఆవరణలో నిరసన చేపట్టిన రైతు కూలీలు


ఓటు హక్కును వినియోగించుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న అన్నదానేశ్వరస్వామి

హొసపేట, ఫిబ్రవరి 16: ప్రజాస్వామ్యానికి ఎన్నికల ప్రక్రియ ప్రాణంలాంటిదని రాజ్యాంగం ప్రసాదించిన ఓటుహక్కును సక్రమంగా వినియోగించుకుని అర్హత కలిగిన అభ్యర్థిని ఎన్నుకోవడం మన కర్తవ్యమని అన్నదానేశ్వరస్వామి అన్నారు. కన్నడ విశ్వవిద్యాలయ మంటప హాల్లో ఓబవ్వ స్టడీ ఛైర్, డెవలప్‌మెంట్ స్టడీస్ విభాగం, జాతీయ సేవా ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటింగ్ అవగాహన కార్యక్రమానికి అయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఏడాది పొడవునా ఎన్నికల ప్రక్రియలు జరగడం మన దేశంలో సాధారణ విషయమన్నారు. 18ఏళ్లు నిండిన యువతీ యువకులందరూ సమీపంలోని ఓటరు నమోదు కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకుని తప్పనిసరిగా ఓటు వేయాలన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కన్నడ విశ్వవిద్యాలయం గౌరవ కులపతి పరమశివమూర్తి మాట్లాడుతూ ఓటు అనేది ధాన ధర్మం కాదని, అది మనందరి హక్కు అని అన్నారు. ఈసందర్భంగా శ్రీధర, ప్రొఫెసర్ బసవ రాజు, హనుమంతప్ప, వివిద సంస్థల డీన్‌లు వివిధ విభాగాల అధిపతులు విద్యార్థులు పాల్గొన్నారు.

బాలల చట్టాలను అమలు చేయాలి : శశిధర కోశాంబే



మాట్లాడుతున్న శశిధర కోశాంబే

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 16: జిల్లాలో బాలల వేధింపులు, బాల్యవివాహాలు, బాలకార్మికుల కేసులు పెరుగుతున్నాయని కర్ణాటక రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు శశిధర కోసాంబే అన్నారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, జిల్లాపరిపాలన, జిల్లాపంచాయితీ, న్యాయసేవల అథారిటీ, మహిళా శిశు అభివృద్ధి శాఖ కలిసి జిల్లా పంచాయితీ హాల్లో అధికారుల కోసం శుక్రవారం ఏర్పాటు చేసిన రెండు రోజుల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ పరిధిని గ్రహించి బాధ్యతగా విధులు నిర్వర్తించినప్పుడే చట్టాల అమలు సాధ్యమవుతుందన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఇలాంటి వర్క్‌షాపు అవసరమన్నారు. కల్యాణ కర్ణాటకలో మైనర్లు గర్భం దాల్చడం బాధకరమని, బాల్య న్యాయ చట్టం, బాల్య వివాహాల నిషేధ చట్టంపై సంబంధిత శాఖలు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి రాజేశ్ హొసమనె మాట్లాడుతూ దేశాభివృద్ధిలో నాణ్యమైన విద్య, మంచి ఆరోగ్యం, సమాజంలో మంచి అవకాశాలు కల్పించడమే ప్రథమ కర్తవ్యమన్నారు. మహిళా శిశు అభివృద్ధిశాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయ్‌కమార్, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులైన రాఘవేంద్ర భట్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

బైరాపురం గ్రామ పంచాయతీని పరిశీలించిన డిప్యూటీ సీఈవో

కంప్లి, ఫిబ్రవరి 16 : గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులు నాణ్యతగా చేపట్టాలని డిప్యూటీ సీఈవో రాహుల్ శరణప్ప సుంకనూరు తాలుకా, గ్రామ పంచాయతీ అధికారులకు సూచించారు. గురువారం సిరుగుప్ప తాలుకా పరిధిలోని బైరాపురం గ్రామ పంచాయతీని పరిశీలించారు. ఆ గ్రామంలో రాజీవ్ గాంధీ సేవా కేంద్రం, జేజీఎం జలజీవన్ పనులు, శౌచాలయాలు, మధ్యాహ్న భోజనం గదులు తదితర భవనాలను పరిశీలించారు. బైరాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని గోసబాళ్ గ్రామానికి చెందిన శరణం సిద్దప్ప రూ. 30 లక్షలు విలువ చేసే ఒక ఎకరా స్థలాన్ని పాఠశాల ఏర్పాటుకు వితరణ చేయడంతో ఆయనను జెడ్పీ సీఈవో రాహుల్ శరణప్ప సుంకనూరు, అధికారులు అభినందించారు. ఈ సందర్భంగా జెడ్పీసీఈవో మాట్లాడుతూ ప్రతి గ్రామంలో శరణం సిద్దప్ప మాదిరిగానే దాతలు ముందుకు రావాలన్నారు. ఈ పాఠశాలల్లో పెద్ద పెద్ద చదువులు చదివి ఉన్నత స్థాయికి వెళ్లిన సమయంలో విద్యార్థులకు ఈ దాతలు గుర్తుండి పోతారన్నారు. అలాగే మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం కింద గ్రామాలలో అభివృద్ధి పనులు జరుపుకోవాలని సూచించారు. వారితో పాటు ఈ కార్యక్రమంలో తాలుకా ఈవో పవన్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ మనోహర్ పాల్గొన్నారు.

హోసూరు జోన్

రైతుల సమస్యలు ఆలకించిన కలెక్టర్



రైతుల సమావేశంలో కలెక్టర్ సరయు తదితరులు

హోసూరు (కృష్ణగిరి) ఫిబ్రవరి 16: కృష్ణగిరి జిల్లాలో రైతుల సమస్యలను నేరుగా పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతి నెలా రైతు ఫిర్యాదుల పరిష్కార దినోత్సవ సమావేశం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా 2024 జనవరిలో వచ్చిన 184 వినతులలో 85కు సంబంధిత అధికారులకు సమాధానాలు ఇచ్చారు. తాజాగా శుక్రవారం రైతు ఫిర్యాదుల పరిష్కార దినోత్సవ సమావేశంలో కలెక్టర్ సరయ పాల్గొని వారి సమస్యలను ఆలకించారు. సమావేశంలో కృష్ణగిరి ఫిషరీస్ ఇన్‌స్పెక్టర్ వీడియో ద్వారా ఆక్వా సాగు పద్ధతులు, కార్యాచరణ ప్రణాళికలను రైతులకు వివరించారు. పాలకోడ్ షుగర్ మిల్స్ మేనేజింగ్ ఆధ్వర్యంలో చెరుకు సాగుపై అవగాహన కల్పించారు. తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ కుటుంబానికి ఒక విద్యార్థి చొరవను ప్రస్తావించారు. అలాగే సమావేశంలో రైతుల భూ ఆక్రమణలు, విద్యుత్ కనెక్షన్, నీరు పరిస్థితి నిర్వహణ, రహదారి సౌకర్యం, రెవెన్యూ శాఖ పత్రాలు, ఇంటి టైటిల్ జారీ, తాగునీటి సౌకర్యం, వ్యవసాయ సంబంధిత శిక్షణ, బ్యాంకు రుణం, అటవీ శాఖ, బస్సు సౌకర్యం, వ్యవసాయ సంబంధిత శిక్షణ, బ్యాంకు రుణం, రోడ్డు ఆక్రమణ తొలగింపు, సరస్సు శుభ్రపరచడం, హైవే శాఖ, వెటర్నరీ ఆసుపత్రి, ల్యాండ్ సర్వే తదితర అంశాలపై రైతులు తమ వినతిపత్రాలు అందజేశారు. వినతులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. కాగా ఈనెల 17 నుంచి 21వరకు ఐదు రోజుల పాటు ప్రభుత్వ ఉమెన్స్ ఆర్ట్ కళాశాలలో నిర్వహించే పుస్తక మహోత్సవానికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు.

నరసీపురంలో ఘనంగా ఎద్దుల పండుగ

హోసూరు, ఫిబ్రవరి 16: హోసూరు సమీపంలోని నరసీపురం గ్రామంలో సంప్రదాయబద్ధంగా ఎద్దుల పండుగ శుక్రవారం జరిగింది. 500కు పైగా ఎద్దులు పరుగులు తీశాయి. ఎద్దులను పట్టుకోవడం ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. హోసూరు, డెంకణీకోట, తళి, అంచెట్టి, కెలమంగలం, రాయకోట, ఉద్దనపల్లి, బాగలూరు, బేరికై, శూలగిరి, పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, ఆంధ్రా ప్రాంతాల నుంచి 500కుపైగా ఎద్దులను తీసుకొచ్చి రంగు రంగుల తోర ణాలతో అలంకరించారు. ఎడ్లపందెలో వాటిని పట్టుకున్న వారికి త గిన బహుమతులు అందజేశారు. సాంప్రదాయక ఎద్దుల పండుగకు హోసూరు చుట్టు ప్రాంతాల నుంచి 10 వేల మందికి పైగా పాల్గొన్నారు.

గవర్నర్ మద్దతుదారుల తీరుపై అసంతృప్తి

హోసూరు, ఫిబ్రవరి 16: గవర్నర్‌ను మార్చాలనే వ్యాజ్యం సుప్రీంకోర్టులో ఉందని అయితే గవర్నర్‌కు మద్దతు ఇచ్చేవారు చిత్తశుద్ధిలేరని మంత్రి రఘుపతి అసంతృప్తి వ్యక్తం చేశారు. హోసూరులో ఓ ప్రైవేట్ ఆసుపత్రి ప్రారంభంలో పాల్గొన్న అనంతరం మీడియాతో మాట్లాడారు. మనసాక్షి ఉన్నవారు గవర్నర్ చర్యలను అంగీకరించరన్నారు. గవర్నర్ మార్చాలనే అనే అంశంపై సుప్రీంకోర్టులో కేసు నడుస్తున్నందున ఇంతకు మించి వ్యాఖ్యానం సముచితం కాదని అభిప్రాయపడ్డారు. ఈపీఎస్ ఆరోపణలపై స్పందిస్తూ దేశంలో వినూత్న పథకాలు రాష్ట్రంలో అమలవుతున్నాయన్నారు. సమావేశంలో సమావేశంలో డీఎంకే ప్రముఖులు మేయర్ సత్య, ఎమ్మెల్యే వై ప్రకాశ్, డిప్యూటీ మేయర్ ఆనందయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రి ప్రారంభంలో మంత్రి రఘుపతి

విమానాశ్రయానికి రూ.220 కోట్లు కేటాయింపు

వార్షిక బడ్జెట్‌లో రాయచూరు జిల్లాకు సీఎం వరాలు..!

రాయచూరు, ఫిబ్రవరి 16 : రాష్ట్ర శాసనసభలో శుక్రవారం వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రాయచూరు జిల్లాకు వరాల జల్లు కురిపించారు. నగర సమీపంలోని యరమరస్ వద్ద నిర్మిస్తున్న విమానాశ్రయం నిర్మాణానికి బడ్జెట్‌లో రూ.220 కోట్లు కేటాయించడం గమనార్హం. దీంతో పాటు ఏపీఎంసీ మార్కెట్ యార్డ్‌లో మిర్చీ మార్కెట్ కోసం ప్రత్యేయకంగా రూ.20 కోట్లను కేటాయిస్తు బడ్జెట్‌లో ప్రకటించారు. దీంతో పాటు వ్యవసాయ మార్కెట్ యార్డులో శిథిలమైన ఇళ్ల నిర్మాణం కోసం రూ.40 కోట్లను బడ్జెట్‌లో కేటాయించారు. మస్కి తాలూకా పామనకల్లూరు ఇతర గ్రామాలకు నారాయణపూర్ కుడికాలువ ద్వార నీరందించేందుకోసం ఉద్దేశించిన ఎత్తిపోతల పథకానికి రూ.990 కోట్లను ప్రకటించారు. చీకలపర్వి గ్రామం వద్ద తుంగభద్ర నదికి బ్రిడ్జీ కం బ్యారేజ్ నిర్మాణం కుర్డి చెరువుకు నీటిని నింపే పథకం, జిల్లా ఆస్పత్రిలో సార్వత్రిక ఆరోగ్య ప్రయోగశాల ఏర్పాటు, రాయచూరులో మహిళ మిల్క్ బ్యాంక్ ఏర్పాటు, జవళి పార్కు ఏర్పాటు, విజ్ఞాన కేంద్రం కార్యాలయం స్థాపన, మంత్రాలయం సమీపంలో జిల్లా నుంచి మంత్రాలయానికి అనుసంధానంగా చిక్కమంచాలివద్ద బ్రిడ్జ్ కం బ్యారేజ్ నిర్మాణం కోసం ప్రజాపనుల శాఖకు రూ.159 కోట్లను విడుదల చేస్తున్నట్లు బడ్జెట్‌లో పేర్కొన్నారు.



హాస్టల్‌లో విద్యార్థి ఆత్మహత్య



విద్యార్థి చిన్న హుసేనప్ప(ఫైల్)

రాయచూరు, ఫిబ్రవరి 16 : జిల్లాలోని సింధనూరు నగరంలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ద్వితీయ ఇంటర్ చదువుతున్న ఈ విద్యార్థి సింధనూరు నగరంలోని సాంఘిక సంక్షేమ శాఖ విద్యార్థి వసతి నిలయంలో ఉంటున్నట్లు అధికారులు తెలిపారు. శుక్రవారం ఉదయం స్నానం చేసేందుకు గదిలోకి వెళ్లిన విద్యార్థి స్నానపు గదిలోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు సమీపంలోని గుంజళ్ళికి చెందిన చిన్న హుసేనప్ప(18)గా అధికారులు తెలిపారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన సింధనూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రయిట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

జిడ్డు కృష్ణమూర్తి (వర్ధంతి)



దేశం మెచ్చిన తత్వవేత్తలలో జిడ్డు కృష్ణమూర్తి ఒకరు. 1895 మే 11న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లా మదనపల్లెలో జన్మించారు. 1929 నుంచి తుదిశ్వాస వరకు ప్రపంచం నలుమూలలా పర్యటిస్తూ తాత్విక, ఆధ్యాత్మిక అంశాలపై అనేక ప్రసంగాలు చేశారు. మానసిక విప్లవం, మనోభావ విచారణ, ధ్యానం, మానవ సంబంధాలు, సమాజంలో మౌలిక మార్పు అనే ప్రధాన అంశాలపై ప్రజలను చైతన్యపరిచారు. ఆయన బోధించిన తత్వం ఏ నిర్దీత తాత్విక చట్రంలో ఇమడదు. నవమానవతా వాదిగా, ఎవరి అభిమానాలను ఆశించక, ఎవరి సహాయాలను ఆశించక, ఎవరి నిందలను లెక్కించక జీవన సంగ్రామాన్ని వాస్తవించి, గొప్ప జీవన శిల్పిగా నిలిచారు. సమస్త జీవరాశులపట్ల కారుణ్యాన్ని వ్యక్తం చేసేవారు. 1986 ఫిబ్రవరి 17న కన్నుమూశారు.

కె. చంద్రశేఖర్‌రావు (పుట్టినరోజు)



కేసీఆర్‌గా చిరపరిచితులైన కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు 1954 ఫిబ్రవరి 17న మెదక్ జిల్లా చింతమడక గ్రామంలో జన్మించారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ నేత, రాజకీయ నాయకుడు. సమైక్యాంధ్రప్రదేశ్ నుంచి వేరుపడిన తెలంగాణ రాష్ట్రానికి 2014లో తొలిసారి ముఖ్యమంత్రి అయ్యారు. అలాగే 2018లోనూ రెండోసారి సీఎం అయ్యారు. అంతకుముందు ఎమ్మెల్యేగా, ఎంపీగా, కేంద్రమంత్రిగా వివిధ హోదాలలో వ్యవహరించారు. జాతీయ రాజకీయాల్లో రాణించే ఉద్దేశ్యంతో తెలంగాణ రాష్ట్ర సమితిని 2022లో భారత్ రాష్ట్ర సమితి పేరుగా మార్చుచేశారు.

'బ్రాండ్ బెంగళూరు'కు ప్రాధాన్యం

బెంగళూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు ప్రపంచస్థాయి సౌలభ్యాలు సమకూర్చేందుకు బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చారు. నగరవ్యాప్తంగా తాగునీరు, ఉత్తమ రవాణా వ్యవస్థ, పరిశుభ్రత, అందమైన నగరంగా తీర్చ దలిచినట్టు బడ్జెట్‌లో పేర్కొన్నారు. అభివృద్ధితోపాటు పన్నుల వసూళ్ల పెంచుకునేందుకు మార్గాలను అన్వేషించారు. పన్నుల అక్రమాలు నివారించి 6వేల కోట్లు వసూళ్ల లక్ష్యం గా పెట్టుకున్నారు. ప్రకటనల ద్వారా రూ.2వేల కోట్లు వసూళ్ల లక్ష్యంగా ఉంది. నగరవ్యాప్తంగా 20లక్షల ఆస్తులను డిజిటలీకరణ చేయదలిచారు. డిసెంబరు 25 నాటికి రూ. 1700 కోట్లతో 147 కిలోమీటర్ల వైట్‌ట్యాపింగ్ పనులు పూర్తి చేయదలిచారు. 100 కిలోమీటర్ల రోడ్ల అభివృద్ధికి రూ.200 కోట్లు, సుగమ సంచార బ్రాండ్ ద్వారా అమలు చేయ దలిచారు. బెంగళూరు బిజినెస్ కారిడార్ అనే కొత్త కల్పన పరిచయం చేయదలిచారు. రూ.27 వేల కోట్లతో పీపీపీ పద్ధతిన 73 కిలోమీటర్లను అభివృద్ధి చేయదలిచారు. 250 మీటర్ల ఎత్తుతో స్కైడెస్క్‌లు నిర్మించే అంతర్జాతీయ స్థాయి ప్రాజెక్టుకు అమలు చేయదలిచారు. బీఎంటీసీ, మెట్రో సబ ర్బన్ రైళ్లను అనుసంధానం చేయడం ద్వారా ట్రాఫిక్ నియంత్రణతో పాటు పర్యావరణానికి మేలు చేకూర్చ దలిచారు. నగరంలో నిత్యం 8 లక్షలమంది మెట్రోలో సంచరిస్తున్నందున 2025 మార్చి నాటికి ప్రస్తుతం కార్యాచరణలో ఉన్న 74 కిలోమీటర్లలో 44 కిలోమీటర్ల మేర అందుబాటులోకి తీసుకురాదలిచారు. నమ్మ మెట్రో స్టేజ్ 3కి రూ.15,611 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం పాలనా అనుమతులకు కేటాయించింది. బెంగళూరుకు 1334 ఎలక్ట్రికల్ బస్సులు, 820 బీఎస్6 బస్సులను కొనుగోలు చేయదలిచారు. జలమండలి ద్వారా రూ.5,550 కోట్లతో 775 ఎంఎల్‌డీ సామర్థ్యంకల్గిన కావేరి స్టేజ్-5 పనులకు ఆమోదం తెలిపారు. చెత్త సంస్కరణ కేంద్రాలను నగర శివారులో నాలుగు వైపులా 100 ఎకరాల చొప్పున గుర్తించి 30ఏళ్ల పాటు కొనసాగే అవకాశం కల్పించారు. బెంగళూరు సహా పది మహానగర పాలికెలలో రాత్రి 1గంటవరకు వ్యాపారాలకు వెసలుబాటు కల్పించారు. మునిసిపల్ వ్యవహారాలలో భాగంగా 2వేల కోట్లతో పది మహానగర పాలికెలలో మౌలిక సదుపాయాలు కల్పించ దలిచారు. స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా చెత్త సంస్కరణకు కేంద్ర గ్రాంటు రూ.2,185 కోట్లకు అను బంధంగా రూ.5072 కోట్లతో స్వచ్ఛ వాతావరణం కల్పించదలిచారు.

గృహజ్యోతి గ్యారెంటీతో 1.65 కోట్ల ఇళ్లకు ఉచిత విద్యుత్

గృహజ్యోతి గ్యారెంటీతో 1.65 కోట్ల ఇళ్లకు ఉచిత విద్యుత్ కల్పించడం ద్వారా 5 కోట్లమంది లబ్ధి పొందుతున్నారని అదనంగా 10 యూనిట్లు పెంచదలిచామన్నారు. రానున్న ఏడేళ్లలో పెట్టుబడుల ఆకర్షణకు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 32వేల నుంచి 60వేల మెగావాట్లకు పెంచ దలిచామన్నారు.

రాష్ట్ర రహదారులకు భారీగా నిధులు

రాష్ట్ర రహదారులకు అనుబంధంగా 875 కిలోమీటర్ల అభివృద్ధికి ఆర్థిక సంస్థల ద్వారా 5736 కోట్ల రూపాయలు రుణం తీసుకోదలిచారు. 1300 కిలోమీటర్ల ప్రముఖ రోడ్లను 4వేల కోట్లతో అభివృద్ధి చేయదలిచారు. బెళగావిలో 4.50 కిలోమీటర్ల మేర ఫ్లై ఓవర్ నిర్మాణానికి 450కోట్లు ఖర్చు చేయదలిచారు. చిక్కబళ్ళాపుర, మైసూరు, కుక్కరహళ్ళితో పాటు ఆరు ప్రాంతాలలో రైల్వే అండర్, ఫ్లై ఓవర్‌ల నిర్మాణానికి రూ.350కోట్లు కేటాయించదలిచారు. మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా 320 కిలోమీటర్ల తీర ప్రాంతాన్ని రూ.20వేలకోట్లతో అభివృద్ధి చేయదలిచారు. సాగర మాల పథకంలో భాగంగా 1017 కోట్లతో 26 పనులకు రాష్ట్ర వాటాకింద రూ.530 కోట్లు కేటాయించారు. ఉత్తరకన్నడ జిల్లా ఖేణిలో ఓడరేవు నిర్మాణానికి పీపీపీ పద్ధతిన 4,200 కోట్లు ఖర్చు చేయదలిచారు. పావినకుర్వే ప్రాజెక్టును 3048 కోట్లతో నిర్మించనున్నారు. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌ల అనుసంధానం కోసం రూ.1600 కోట్లతో ఎయిర్ పోర్ట్‌లను అభివృద్ధి చేయదలిచారు. రైల్వేశాఖకు అనుబంధంగా 9 పనులకోసం భూస్వాధీన, వాటాలో భాగంగా 9915 కోట్లు ఖర్చు చేయదలిచారు. బెంగళూరు సమీపంలో 2వేల ఎకరాలలో నాలుగు హెల్త్‌కేర్, ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ సిటీ అభివృద్ధి చేసి 40వేల కోట్ల రూపాయల పెట్టుబడులతో 80వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించదలిచారు. బెంగళూరులో స్టార్టప్‌ల అభివృద్ధికి సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌ను రానున్న ఐదేళ్ల వ్యవధికి 10 కోట్ల రూపాయలు కేటాయించారు. బెంగళూరులో గ్లోబల్ కేపబిలిటీసెంటర్స్‌ను ఏర్పాటు చేయదలిచారు.

ఏడాది పొడవునా కర్ణాటక సంభ్రమ

కన్నడ సంస్కృతిశాఖ ద్వారా కర్ణాటక సంభ్రమ 50 ఏడాది పొడవునా కొనసాగించదలిచారు. తద్వారా కన్నడ అభివృద్ధి లక్ష్యంగా పెట్టుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దుకాణాలు, వాణిజ్యసముదాయాలకు 60శాతం కన్నడ బోర్డులు తప్పనిసరి చేశారు. సంచార జాతుల అభివృద్ధి, కళలను ప్రోత్సహించేందుకు సంచార జాతుల ఉత్సవాన్ని నిర్వహించడం తోపాటు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయదలిచారు. మాజీ సీఎం ఎస్ బంగారప్ప స్మారకాన్ని నిర్మించదలిచారు. బెంగళూరులో 70 ఎకరాలతో స్పోర్ట్స్ సిటీ నిర్మాణం, నాలుగు ప్రాంతాలలో అత్యాధునిక క్రీడా మైదానాలు ఏర్పాటు చేయదలిచారు.

వందకోట్లతో అంజనాద్రి అభివృద్ధి

పర్యాటక రంగంలో భాగంగా వంద కోట్లతో అంజనాద్రి కొండను అభివృద్ధి చేయదలిచారు. రాష్ట్రంలోని పది ప్రముఖ స్థలాల్లో కేబుల్ కార్లను అందుబాటులోకి తీసుకురావడం, 530 స్మారకాలను త్రీడీ లేజర్ స్కానింగ్ ద్వారా డిజిటలీకరణ చేయదలిచారు. అటవీ పర్యావరణ పరిరక్షణ ద్వారా రూ.201 కోట్లతో అటవీ ప్రాంతాలలో పంటల రక్షణకు ప్రత్యేక సౌలభ్యం కల్పించదలిచారు. మానవ, వన్యజీవుల సంఘర్షణలను నియంత్రించేందుకు రైల్వే బ్యారికేడ్ నిర్మాణాలకు రూ.100కోట్లు కేటాయించదలిచారు.

డ్రోన్ ద్వారా సర్వే

రాష్ట్రంలోని 30,700 గ్రామాలలో డ్రోన్ ద్వారా సర్వే జరిపి ఆస్తి హక్కులను యజమానులకు ఇవ్వదలిచారు. రెవెన్యూ శాఖను సంపూర్ణంగా డిజిటలీకరణ చేయదలిచారు.

తిరుమలలో సత్రం నిర్మాణాల వేగవంతం

తిరుమలలో రూ.200కోట్లతో నిర్మిస్తున్న సత్రం పనులు వేగవంతం చేస్తామని, శ్రీశైలంలో రూ.85కోట్లతో నిర్మాణాలు కొనసాగుతున్నాయని, వారణాసిలో రూ.5కోట్లతో వసతి సముదాయం కల్పిస్తున్నామన్నారు. మంత్రాలయం చేరుకునేందుకు రాయచూరు జిల్లా చిక్కమంచాలి గ్రామంలో బ్రిడ్జ్ కమ్ బ్యారేజ్ నిర్మాణాలకు రూ.158 కోట్లు కేటాయించారు. న్యాయ విభాగానికి సంబంధించి నిర్మాణాలు, మౌలిక సదుపాయాలకు రూ.175 కోట్లు కేటాయించారు.

రోడ్ల అభివృద్ధికి పెద్దపీట

గ్రామీణాభివృద్ధిలో భాగంగా గ్రామాలకు రోడ్లు సమకూర్చేందుకు ప్రగతి పథ పేరిట 9,450 కిలోమీటర్ల మేర నిర్మాణాలకు రూ.5200 కోట్లు కేటాయించారు. కల్యాణపథ కింద కల్యాణ కర్ణాటక పరిధిలో రూ.1150 కిలోమీటర్ల మేర నిర్మాణాలకు వెయ్యి కోట్లు కేటాయించారు. కల్యాణ కర్ణాటక ప్రాంతీయ మండలి పరిధిలో మౌలిక సదుపాయాలకు రూ.5వేల కోట్లు కేటాయించారు. నైపుణ్యాభివృద్ధిలో భాగంగా యువనిధి గ్యారెంటీ కింద ప్రోత్సాహకాలను అందిస్తున్నట్టు పేర్కొన్నారు. బళ్ళారి, చిత్రదుర్గ జిల్లాలో ఖనిజనిధి ద్వారా గదగ్ జిల్లా రోణలో నాబార్డు ద్వారా రూ.150కోట్లతో కొత్త ప్రాజెక్టులు ఆరంభించదలిచారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, రోబోటిక్స్ వంటి సాంకేతిక విభాగాలలో 15వేల మందికి నైపుణ్యత కల్పించనున్నారు. ఐటీఐలను అభివృద్ధి చేయదలిచారు.

సాంఘిక సంక్షేమానికి రూ.27,674 కోట్లు

అన్నభాగ్యలో భాగంగా 2024 జనవరి చివరిదాకా 4.02 కోట్ల లబ్దిదారులకు రూ.4595 కోట్లు కేటాయించారు. అన్నసువిధ అనే కొత్త ప్రాజెక్టు హోం డెలివరీ యాప్ ద్వారా 80ఏళ్ల పైబడినవారికి ఇంటి చెంతకే ఆహారం అందించదలిచారు. బీసీ సంక్షేమానికి 1600 కోట్ల రూపాయలు కేటాయించారు. సాంఘిక సంక్షేమానికి 27,674 కోట్లు, ఎస్టీల సంక్షేమానికి 11,447 కోట్లు కేటాయించారు. ఇలా అన్ని కీలకశా శాఖలకు భారీగా నిధులు కేటాయించడంపై హర్షం వ్యక్తం అవుతోంది. తొలుత గ్యారెంటీల పథకాలకు అగ్ర ప్రాధాన్యత ఇస్తున్నట్టు ప్రకటించారు.

ఘనంగా చన్నరాయస్వామి బ్రహ్మ రథోత్సవం



రథోత్సవం ఇలా...

మహదేవపుర, ఫిబ్రవరి 16: రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలోని వర్తూరులో చన్నరాయస్వామి బ్రహ్మ రథోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. తొలుత స్వామివారి మూర్తిని పల్లకీలో ఊరేగించి అనంతరం రథంపై కొలువుదీర్చారు. పురవీధులలో సాగిన రథోత్సవం సందడి సాగింది. రథంపై అరటి పండ్లు, ఉప్పు, చక్కెర, దవనం, మిరియాలు వేసిన భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి, మాజీ మంత్రి అరవింద లింబావళి దంపతులు స్వామివారిని దర్శించుకుని మాట్లాడుతూ రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలతో కళకళలాడాలని స్వామిని కోరినట్టు తెలిపారు. చుట్టుపక్కల గ్రామాలైన గుంజూరు, రామ గొండనహళ్ళి, సిద్దాపుర, హరాడి, వైట్‌ఫీల్డ్, కాడుగూడి, నల్లూరహళ్ళి, చన్నసంద్ర తదితర గ్రామాల ప్రజలు రథోత్సవంలో పాల్గొన్నారు. డొల్లుకుణిత, వీరగాసె, మంగళ వాయిద్యాలు, కీలుబొమ్మల కళాబృందాలు సందడి చేశాయి. ఉత్సవంలో మాజీ మంత్రి వర్తూరు ప్రకాశ్, నియోజకవర్గ హోబళి బీజేపీ అధ్యక్షుడు మనోహర్ రెడ్డి, నాయకులు వర్తూరు శ్రీధర్, మహేంద్రమోది, ఎల్ రాజేశ్, శ్రీధర్‌రెడ్డి, స్వాభిమాని బళగ అధ్యక్షుడు కుప్పి మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కోదండరాముడి రథోత్సవం



పురవీధులలో సీతారాముల రథోత్సవం

చేళూరు, ఫిబ్రవరి 16: తాలూకా కేంద్రమైన చేళూరులో రథసప్తమిని పురస్కరించుకుని కోదండ రామాలయంలో శుక్రవారం విశేషపూజలు నిర్వహించారు. మధ్యాహ్నం సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులను రథంపై కొలువుదీర్చి పురవీధులలో ఊరేగించారు. నియోజకవర్గ ఎమ్మెల్యే సుబ్బారెడ్డి పాల్గొన్నారు. స్థానిక ప్రముఖులు చలం, రామాంజనేయరెడ్డి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదాసోహం నిర్వహించారు.

'బెంగళూరు అభివృద్ధికి అనుగుణంగా బడ్జెట్'

బెంగళూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరం విశ్వవ్యాప్తం అనిపించేలా బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చారని అభివృద్ధికి అనుగుణంగా ఉందంటూ నైట్ ఫ్రాంక్ రియల్ సంస్థ ఈడీ శంతను మజుందార్ అభిప్రాయపడ్డారు. ఈమేరకు బడ్జెట్‌పై నైట్‌ఫ్రాంక్ సంస్థ ఒక ప్రకటన విడుదల చేశారు. 73కిలోమీటర్‌ల మేరన బిజినెస్ కారిడార్‌కు రూ.27వేల కోట్లు కేటాయించడం ద్వారా మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత పెరుగుతుందన్నారు. బెంగళూరులో ప్రధానమైన ట్రాఫిక్ సమస్యకు అధిగమించేందుకు ఇదో మార్గదర్శకం కానుందన్నారు. విద్యారంగం మరింత ప్రగతి సాధ్యమని, సైన్స్ అండ్ టెక్నాలజీ, కంప్యూటర్ ల్యాబ్‌లు, ఇంటర్‌నెట్ సౌలభ్యాల మెరుగు ద్వారా మరిన్ని కంపెనీలకు అనుకూలమన్నారు. పది పర్యాటక కేంద్రాలకు కేబుల్‌కార్ రాష్ట్రంలో ప్రథమం కానుందని కొనియాడారు. బడ్జెట్ ఆర్థిక పథకమే కాకుండా సమగ్ర, సుస్థిర అభివృద్ధికి దోహదపడనుందన్నారు. రియల్‌రంగం కూడా ప్రగతి సాధించనుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

పాఠశాలల మౌలిక సదుపాయాలకు రూ.850 కోట్లు

బెంగళూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాఠశాలలు, పీయూ కళాశాలల్లో మౌలిక సదుపాయాలకు బడ్జెట్‌లో రూ.850 కోట్లు కేటాయించారు. ప్రాథమిక, ఉన్నత, పీయూ వరకు ఒకే ప్రాజెక్టుగా సీఎస్ఆర్ గ్రాంట్లతో కర్ణాటక పబ్లిక్ స్కూళ్లను అభివృద్ధి చేయదలిచారు. 3-5 తరగతుల విద్యార్థులకు గణితంలో ఆసక్తి, సామర్థ్యం పెంచేందుకు జేపాల్ సంస్థతో గణిత గణక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

రూ.10 కోట్లతో మరుసించన

6-7 తరగతులలో వెనుకబడిన విద్యార్థులకు రూ.10కోట్లతో మరుసించన కార్యక్రమం అమలు చేస్తారు. విద్యార్థుల సంఖ్యను బట్టి ల్యాబ్‌లు, ఇంటర్నెట్ కోసం రెండేళ్ల ప్యాకేజ్‌గా రూ.50కోట్లు కేటాయించారు. 2వేల పాఠశాలల్లో కన్నడ, ఇంగ్లిషు, ద్విభాషా మాధ్యమగా మార్చు చేయదలిచారు. 100 పీయూ కళాశాలల్లో గణక విజ్ఞానంకై రూ.10కోట్లు కేటాయించదలిచారు. 400మందికంటే ఎక్కువ విద్యార్థులు ఉండే పీయూ కళాశాలలకు సైన్స్ ల్యాబ్‌ల అభివృద్ధికి చెరో 10లక్షల గ్రాంటు మంజూరు చేశారు. పీయూలో సైన్స్ విద్యార్థులకు నీట్, జేఈఈ, సీఈటీలో రాణించేందుకు రూ.10కోట్లతో శిక్షణ ఇవ్వదలిచారు. పాఠశాలలకు ఉచిత విద్యుత్, తాగునీటిని సమకూర్చేందుకు రూ.25కోట్లు కేటాయించారు. ఖాళీ ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను భర్తీ చేయదలిచారు.

ఆర్థిక సంవత్సరంలోనే రాష్ట్ర విద్యావిధానం

జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేసిన తరుణంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే రాష్ట్ర విద్యావిధానాన్ని అమలు చేస్తామని సీఎం సిద్దరామయ్య ప్రకటించారు. ఉన్నత విద్యలో యువతులను ప్రోత్సహించేలా 30 డిగ్రీ కళాశాలలు, మహిళా పాలిటెక్నిక్‌ల ఆధునీకరణకు రూ.30కోట్లు కేటాయించారు.

రూ.500 కోట్లతో ఐఐటీ తరహాలో అభివృద్ధి

డిగ్రీ కళాశాలల్లో మౌలిక సదుపాయాలకు రూ.250 కోట్లు, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కళాశాలల ఆధునీకరణకు రూ.120 కోట్లతోపాటు ఖాళీగా ఉండే లెక్చరర్, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులను భర్తీ చేయదలిచారు. కొప్పళ, బీదర్, రాయచూరు, కలబురగిలలో యూనివర్శిటీలకు అనుబంధంగా అవసరమైన కళాశాలల ఏర్పాటు చేయదలిచారు. విశ్వేశ్వరయ్య ఇంజనీరింగ్ కళాశాలను రూ. 500 కోట్లతో ఐఐటీ తరహాలో అభివృద్ధి చేయదలిచారు. ప్రభుత్వం వందకోట్లు కేటాయించనుండగా మిగిలిన నిధులు సీఎస్ఆర్, పూర్వ విద్యార్థుల ద్వారా సమకూర్చుకోదలిచారు. ఉన్నత విద్యలో పూర్వ విద్యార్థులతో వేరు - చిగురు అనే వినూత్న కార్యక్రమాన్ని ఏర్పాటు చేయదలిచారు.

పేటెంట్ పొందేందుకు రూ.10 కోట్లు

విద్యార్థులు, అధ్యాపకులు తమ ఆవిష్కరణల పేటెంట్ పొందేందుకు అవసరమైన సాంకేతిక సమకూర్చేకునేందుకు రూ.10కోట్లు కార్పస్ ఫండ్‌ను కేటాయించారు. మైసూరు మహారాణి కళాశాలలో సైన్స్ కాలేజీ భవనాలకు రూ.54 కోట్లు, ఆర్ట్స్ అండ్ కామర్స్ భవనాలకు రూ.116 కోట్లు కేటాయించదలిచారు.

మేకెదాటు ముంపు బాధితులకు అండ

▸▸ జలవనరులకు ప్రాధాన్యం

బెంగళూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కావేరి నదికి అనుబంధంగా ప్రతిష్టాత్మకంగా మేకెదాటు ప్రాజెక్టు ద్వారా తాగునీటిని సమకూర్చుకునే పథకాన్ని అమలు చేసేందుకు ఒక ప్రత్యేక ప్రణాళికను, రెండు సబ్‌డివిజన్‌లను స్థాపించినట్టు సీఎం బడ్జెట్‌లో పొందుపరిచారు. మేకెదాటు ముంపు భూములను గుర్తించే సర్వే, చెట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమైందని టాస్క్‌ఫోర్స్ ద్వారా ఇతర ప్రక్రియలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఎత్తిపోతల ద్వారా మహానగరానికి నీటిని సమకూర్చదలిచామన్నారు. ఉత్తర కర్ణాటకలోని ప్రముఖ ప్రాజెక్టు కృష్ణ ఎగువ స్టేజ్-3కు అనుబంధంగా ఉప ప్రాజెక్టు పనులను పూర్తి చేసేందుకు భూ స్వాధీన, పునరావాసం, పునఃనిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. కృష్ణ ట్రిబ్యునల్-2 తుది తీర్పు పెండింగ్‌లో ఉన్నా గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని కేంద్రప్రభుత్వాన్ని ఒత్తిడి చేయడంతోపాటు చట్టపరమైన చర్యలు కొనసాగిస్తామన్నారు. భద్ర ఎగువ ప్రాజెక్టుకు కేంద్రం గత ఏడాది బడ్జెట్‌లో కేటాయించిన రూ.5,300 కోట్లలో నిధులు విడుదల చేయని అంశాన్ని ప్రస్తావించారు. జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన మేరకు ప్రధానికి ధన్యవాదాలు తెలిపామని అయితే ఏడాదిగా కేంద్రం నిధులు విడుదల చేయలేదన్నారు. పథకంలో భాగంగా చిత్రదుర్గ జిల్లాలో 75వేల ఎకరాలకు నీరు సమకూరనుందన్నారు. కళసా-బండూరి ద్వారా ప్రాజెక్టుకు 3.9 టీఎంసీల నీటిని కేటాయించే డీపీఆర్‌కు కేంద్రం అనుమతించిందని అయితే వన్య జీవి మండలి అభ్యంతరంతో పెండింగ్‌లో ఉందని, వెంటనే జాతీయ వన్యజీవి మండలి స్థాయి సమితి సభలో పరిష్కారం చేయించి పనులు ప్రారంభిస్తామన్నారు. తుంగభద్ర జలాశయంలో పూడికతో నీటి సేకరణ తగ్గిందని, ఇదే సామర్థ్యంతో కొరత నివారించేందుకు కొప్పళ జిల్లా నవళి వద్ద ప్రత్యామ్నాయ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.15,600 కోట్లు డీపీ సిద్ధమన్నారు. ధారవాడలో సెంటర్ ఫర్ ఎక్సలెన్సీ ఇన్ వాటర్ మేనేజిమెంట్‌ను ఆధునీకరించ దలిచామన్నారు. పావగడలో సోలార్ పార్క్ తరహాలో జలవనరులశాఖ బ్యాక్ వాటర్ ప్రాంతంలో సోలార్‌పార్క్‌లను ప్రారంభించేందుకు పీపీపీ విధానం అమలు చేయదలిచామన్నారు. హేమావతి ప్రాజెక్ట్ 5.45 కిలోమీటర్లు తుమకూరు శాఖ కాలువ 166.09 కిలోమీటర్లు ఆధునీకరించదలిచామన్నారు. రాష్ట్రంలో ఎత్తిపోతల పథకంలో కలబురగి జిల్లా నడహళ్ళి, ఉడుపి జిల్లా స్వర్ణ సిద్దాపుర తోపాటు 25 ప్రాజెక్టులకు రూ.7,280 కోట్లు కేటాయించదలిచామని తద్వారా 97,698 హెక్టార్లు నీటిసౌలభ్యం సాధ్యం కానుందన్నారు.

ఎత్తిపోతల పథకాలకు రూ.3,799 కోట్లు

కృష్ణ భాగ్య జలనిగమ కింద ఎత్తిపోతల పథకంలో భాగంగా బాగల్కోటె జిల్లా కరూరు విజయపుర జిల్లా హోర్తి, రేవణ సిద్దేశ్వర, ముళవాడ, యాదగిరి జిల్లా బీమా ఫ్లాంక్‌లలో రూ.3799 కోట్లతో అమలు చేయదలిచామని తద్వారా 1.09 లక్షల హెక్టార్ల ఆయకట్టుకు నీరు సాధ్యం కానుందన్నారు.


అర్కావతి నది అభివృద్ధికి రూ.2వేల కోట్లు

కొప్పళ జిల్లా 38 చెరువులకు నీరు మళ్లించేందుకు రూ.970 కోట్లు, రాయచూరు జిల్లా మస్కి తాలూకా పామనకల్లూరు, నారాయణపుర కుడి కాలువ నుంచి రూ.990 కోట్లతో నీటిని మళ్లించే ప్రాజెక్టు చేపడతామన్నారు. కావేరి జలనిగమ కింద కాలువల అభివృద్ధితోపాటు రామనగర పరిధిలోని అర్కావతి నది అభివృద్ధికి రూ.2వేల కోట్లు కేటాయించారు. కలబురగి నగరానికి బీమా, కాగిన నదులనుంచి తాగునీటికి రూ.365 కోట్లు కేటాయించారు.


చెరువులకు రూ.200 కోట్లు

చిన్ననీటిపారుదల విభాగం నుంచి చెరువులు, కాలువలు అభివృద్ధి కోసం 115 పనులకు రూ.200 కోట్లు కేటాయించారు. కేసీ వ్యాలీ రెండో విడత 272 చెరువులకు రూ.455 కోట్లతో పనులు పూర్తి చేయదలిచారు. రాయచూరు జిల్లా చిక్కల పరవి, నంజనగూడు తాలూకా దేవనూరుతోపాటు పలు చెరువు లకు నీరు మళ్లించే చెరువు, బ్రిడ్జ్ కమ్ బ్యారేజ్‌ల నిర్మాణానికి రూ.850 కోట్లు కేటాయించారు. ఇలా పలు జిల్లాల్లో చిన్ననీటి పారుదల చెరువుల అభివృద్ధికి తగిన ప్రాధాన్యత ఇవ్వదలిచారు.

సిద్దూ బడ్జెట్‌పై పారిశ్రామిక వర్గాల మిశ్రమ స్పందన



సమాఖ్య అధ్యక్షుడు రమేష్‌చంద్ర లహోటి



కాసియా అధ్యక్షుడు శశిధర శెట్టి

బెంగళూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సిద్దరామయ్య బడ్జెట్‌పై పారిశ్రామిక వర్గాల నుండి మిశ్రమ స్పందన వ్యక్తమైంది. కర్ణాటక వాణిజ్య పరిశ్రమల సమాఖ్య అధ్యక్షుడు రమేష్‌చంద్ర లహోటి నగరంలో శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ అభివృద్ధికి ఊతమిస్తూ సంక్షేమానికి ప్రాధాన్యతనివ్వడం ద్వారా సమతౌల్యం పాటించారన్నారు. సమాఖ్య సిఫారసుల మేరకు బెంగళూరు-ముంబై కారిడార్ అభివృద్ధిలో భాగంగా ధార్వాడ వద్ద ఇండస్ట్రియల్ నోడ్ ఏర్పాటును ఆయన స్వాగతించారు. కల్బుర్గిలో మెగా జౌళి పార్కు ఏర్పాటుతో పాటు 10 ద్వితీయ శ్రేణి నగరాల అభివృద్ధి వంటి అంశాలు పారిశ్రామిక ప్రగతికి బాగా దోహదపడతాయన్నారు. ఎపిఎంసిల డిజిటలీకరణకు బడ్జెట్‌లో రూ 10 కోట్లు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. పది పర్యాటక ప్రాంతాల సమగ్ర అభివృద్ధి చాలామంచి నిర్ణయమన్నారు. 44 కిమీ మేరకు మెట్రో రైలు మార్గం విస్తరణ, విద్యుత్ రంగానికి రూ 23,159 కోట్ల కేటాయింపు, రాష్ట్రంలో విదేశీ పెట్టుబడులను ఆకర్షించే దిశలో 2025 ఫిబ్రవరిలో గ్లోబల్ ఇన్వెస్టర్ల మీట్ నిర్వహణ నిర్ణయాలను ఆయన స్వాగతించారు. బడ్జెట్ మొత్తం మీద పారిశ్రామిక స్థిర ప్రగతిని దోహదపడేలా ఉందన్నారు. కాగా సిద్దూ బడ్జెట్ పై కర్ణాటక చిన్నతరహా పరిశ్రమల సమాఖ్య (కాసియా) పెదవి విరిచింది. బడ్జెట్‌లో చిన్నతరహా పరిశ్రల ప్రగతిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని కాసియా అధ్యక్షుడు శశిధర శెట్టి వాపోయారు. కోవిడ్ సమయంలో బాగా దెబ్బతిన్న చిన్న పరిశ్రమల ప్రగతికి రాయితీలు ప్రకటించి ఉండాల్సిందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజా సంక్షేమానికి బడ్జెట్‌లో పెద్దపీట వేశారని ఆయన కొనియాడారు. మౌలిక సదుపాయాల రంగానికి కూడా ప్రాధాన్యత బాగానే ఉందన్నారు.

కేంద్రం వివక్షపై పోరాటానికి స్ఫూర్తినిచ్చే బడ్జెట్

▸▸ ఎంఎస్ రక్షారామయ్య

బెంగళూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పన్నుల వాటా విడుదలలో చూపుతున్న వివక్షపై పోరాడేందుకు సిద్దరామయ్య బడ్జెట్ ఏడుకోట్ల మంది కన్నడిగులకు గొప్ప స్ఫూర్తినిస్తోందని యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఎస్.రక్షారామయ్య పేర్కొన్నారు. నగరంలో శుక్రవారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్రం ప్రభుత్వం జీఎస్టీ పన్నుల వాటా, కరువు సాయం విడుదల ఇత్యాది అంశాలలో రాష్ట్రానికి చేస్తున్న దారుణ అన్యాయంపై ఢిల్లీ జంతర్‌మంత్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన నిరశన బీజేపీ నిజస్వరూపాన్ని జాతీయ స్థాయిలో బయటపెట్టిందన్నారు. ఈ ధర్నా అనంతరం బీజేపీలో గుబులు ప్రారంభమైందన్నారు. ఇందులో భాగంగానే శాసనసభలో బడ్జెట్ ప్రసంగాన్ని బహిష్కరించడం ద్వారా బీజేపీ నేతలు తమ దివాళాకోరు రాజకీయాన్ని ప్రదర్శించారన్నారు. తమకు నచ్చకపోతే బడ్జెట్‌పై సభలో ప్రసంగించి ప్రశ్నించే అవకాశం ప్రతిపక్షాలకు ఉందన్నారు. బడ్జెట్ సమావేశం నుంచి వాకౌట్‌చేసి శాసన సభ ఆవరణలో ప్లకార్డులో బీజేపీ ఎమ్మెల్యేలు ధర్నా చేసిన తీరుపై ఆయన ధ్వజమెత్తారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థపై బీజేపీకి ఉన్న గౌరవం ఏపాటిదో ఈ ఘటనతో తేలిపోయిందన్నారు. బీజేపీ పలాయన వాదాన్ని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ అంటూ రాష్ట్ర ఖజానాకు రావాల్సిన రూ 11,495 కోట్లకు టోకరా వేసిన బీజేపీ నేతలు ప్రజలకు తొలుత బదులివ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఇది ఎన్నికల బడ్జెట్ కాదని ఐదు గ్యారెంటీ పథకాలపై ప్రజల్లో మరింత భరోసా కల్పించేదని అభివర్ణించారు.

బడ్జెట్‌లో స్త్రీ శిశు సంక్షేమానికి భారీ కేటాయింపులు : మంత్రి హర్షం

బెంగళూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను చారిత్రాత్మకమైనదని స్త్రీ శిశు సంక్షేమ శాఖా మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ ప్రశంసించారు. ఈ మేరకు శుక్రవారం ఆమె నగరంలో ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రత్యేకించి బడ్జెట్‌లో చిన్నారులు, మహిళల సంక్షేమానికి గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ కేటాయింపులు చేశారన్నారు. మహిళ సంక్షేమం ప్రగతి కోసం పలు పథకాలకు రూ.86,423 కోట్లు కేటాయించారని అలాగే చిన్నారుల సంక్షేమానికి వివిధ పథకాల ద్వారా రూ 54,617 కోట్లు కేటాయించారన్నారు. బడ్జెట్‌లో గృహలక్ష్మి గ్యారెంటీ పథకానికి రూ 28,608 కోట్లు, అంగన్‌వాడీలకు స్మార్ట్ ఫోన్లను సమకూర్చందుకు రూ.90 కోట్లు కేటాయించారన్నారు. ఈ మొత్తంతో రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలకు 75,938 స్మార్ట్‌ఫోన్లను అందిస్తామన్నారు. అంగన్‌వాడీల సొంత కట్టడాల నిర్మాణం కోసం బడ్జెట్‌లో రూ.200 కోట్లు కేటాయించారన్నారు. మహిళ ఉచిత బస్సు ప్రయాణం సదుపాయం కల్పించే శక్తికి రూ.3వేల కోట్లు కేటాయించడం ద్వారా ప్రభుత్వం తన నిబద్ధతను చాటుకుందన్నారు.


వడ్డీ రహిత రుణాలు రూ. 5 లక్షలకు పెంపు

బెంగళూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సిద్దరామయ్య తన బడ్జెట్‌లో రైతులపై కనికరం చూపారు. సహకార సంఘాల ద్వారా రైతులకు ఇస్తున్న వడ్డీ రహిత రుణాలను రూ.3లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. అలాగే 3శాతం వడ్డీతో ప్రస్తుతం ఇస్తున్న రూ.10లక్షల రుణాల మొత్తాన్ని రూ.15లక్షలకు పెంచారు. ప్రస్తుత ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 36లక్షలకుపైగా రైతాంగానికి రూ.27వేల కోట్ల మేర రుణాలు పంపిణీ చేయదలిచారు. రాష్ట్రంలోని యలబుర్గా, బసవనబాగేవాడి, రాణిబెన్నూరు, బళ్ళారి, గదగ్ వ్యవసాయ మార్కెట్‌లలో రూ.50కోట్ల ఖర్చుతోనూ, రాయచూరు, మైసూరులలో రూ.80కోట్ల ఖర్చుతోనూ శీతలగిడ్డంగులను నిర్మించదలిచారు. రాయచూరులో ఎండు మిర్చి మార్కెట్‌ను రూ.25కోట్లతో ఏర్పాటు చేస్తారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం అమలులోకి తెచ్చిన ఏపీఎంసీ సవరణ చట్టాలను పూర్తిగా రద్దు చేయడం ద్వారా అన్నదాతలకు ఏర్పడ్డ ఇబ్బందులను తొలగించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 4.54 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కల్గిన 76 గిడ్డంగులను రూ.376 కోట్లతో ఆధునీకరించనున్నారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు

చింతామణి, ఫిబ్రవరి 16: రథసప్తమిని పురస్కరించుకుని పట్టణంలోని పతంజలి యోగ శిక్షణ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం 108 సూర్య నమస్కారాల కార్యక్రమాన్ని హరిహరేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్వహించారు. మహిళలు, పురుషులు కూడా పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. వేకువజామున 5.30 గంటలకు యోగా భ్యాసకులు చేరి తూర్పుకు అభిముఖంగా నిలిచి సూర్యనమస్కార మంత్రాన్ని పఠిస్తూ సామూహికంగా 108సార్లు సూర్యనమస్కారం చేశారు. యోగా గురువు నారాయణప్ప మాట్లాడుతూ ప్రత్యేకించి మాఘ శుక్లపక్ష సప్తమి రోజున సూర్యుడిని ఆరాధించడం ద్వారా ఆరోజు చేపట్టే అన్ని ప్రముఖ పనులు ఫలప్రదం అవుతాయన్న విశ్వాసం ఉందన్నారు. రిటైర్డు డీడీపీఐ నారాయణస్వామి మాట్లాడుతూ రథసప్తమి రోజున సూర్యోదయానికి ముందే మాఘస్నానం ఆచరించడం పుణ్యదాయకమని, అనంతరం సూర్యుడిని ఆరాధించడంతో ఆయురారోగ్యాలు లభించడం సాధ్యమన్నారు. పలువురు యోగా గురువులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. శ్రీనివాసశెట్టి, గురురాచంద్రప్ప, రమేశ్, శంకరణ్ణ, నారాయణస్వామి, పద్మక్క, మంజుళా, లక్ష్మీ, శ్రీదేవి తదితరుల నేతృత్వంలో కార్యక్రమం సాగింది.

బాలికలను రక్షించడం ప్రతి ఒక్కరి కర్తవ్యం



ప్రసంగిస్తున్న అసంఘటిత జిల్లా పిల్లల రక్షణాధికారి గాయత్రి

బాగేపల్లి, ఫిబ్రవరి 16: బాలికలను రక్షించడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని అసంఘటిత జిల్లా పిల్లల రక్షణాధికారి గాయత్రి అభిప్రాయపడ్డారు. తాలూకాలోని ఘంటంవారిపల్లి ప్రభుత్వ హైస్కూల్‌లో జిల్లా పంచాయతీ, జిల్లా న్యాయసేవల ప్రాధికార, స్త్రీ శిశుసంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటైన బేటీ బచావో బేటీ పఢావో కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. బాలికల భ్రూణ హత్య, బాల్య వివాహ నిషేధం, పోస్కో చట్టాల గురించి జాగృతి పెరగాలన్నారు. ఇటీవలికాలంలో హ్యూమన్ ట్రాఫికింగ్ వంటివి తరచూ చోటు చేసుకుంటున్నాయని విచారం వ్యక్తం చేశారు. బాల బాలికలు ఎవరైనా విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. 18ఏళ్ల తర్వాతనే బాలికకు వివాహం చేయాలన్నారు. సమాజంలో లింగబేధం వీడాలన్నారు. ఇలా పలు అంశాలను ప్రస్తావించారు. ప్రధానోపాధ్యాయురాలు రామసుబ్బమ్మ, ఉపాధ్యాయులు ఎన్ఎన్ సంధ్యా, ఎన్ జంగమ శ్రీనివాస్, సీ నారాయణస్వామి, వరలక్ష్మి, జయశ్రీ, రామచంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేరేది ఎన్నడో..!



రైతుసంఘం ఆధ్వర్యంలో నిరసన

దొమ్మసంద్ర, ఫిబ్రవరి 16: రైతులకు ఇచ్చిన హామీలు నెరవేరేది ఎన్నడో అని గ్రీన్ బ్రిగేడ్ రైతుసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. రైతు సంఘం సంచాలకులు హుస్కూరు రఘు నేతృత్వం వహించారు. హుస్కూరు నుంచి దొమ్మసంద్రకు ర్యాలీ సాగగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిందంటూ రైతులను అడ్డుకుని అరెస్టు చేసి అనంతరం విడుదల చేశారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి ఇచ్చిన హామీలు కేంద్రం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో రైతు పోరాట నేతలు కేశవరెడ్డి, శ్రీనివాసరెడ్డి, జయరామ్, శ్రేయస్, ప్రమోద్, మంజు తదితరులు పాల్గొన్నారు.